# ప్రేమ ఓడిపోదు

—మన్నెం శారద

**సూర్యుడు తూర్పువైపు నుంచి తన్నిన బంతిలా పడమటకి వాలి పోతున్నాడు.**

**ఓడిపోయిన వెలుగు అవమానంతో హరించుకుపోతోంది. విజయం వరించిన చీకటి వేల చేతులతో సృష్టిని తన గుప్పిటలో బిగించే ప్రయత్నం చేస్తోంది.**

ఆ కొండ అంచులో మనిషి సృష్టించిన తోటలో రీటైనింగ్ వాల్‌ని ఆనుకుని లోయల్లోకి చూస్తున్నాను.

ఎత్తయిన కొండల మూలల దట్టంగా ఘనీభవించిన చీకటి సాయంసంధ్యతో జతకలిపి ద్రవించి, ప్రవించి లోయంతా ఆక్రమిస్తోంది. పచ్చని చెట్లన్నీ నల్లని ముసుగు వేసుకుంటున్నాయి. కొండ కొసలు మాత్రం అస్త మిస్తున్న సూర్యకాంతితో ముక్కోపి ముక్కులా ఎర్రగా మెరుస్తున్నాయి.

అక్కడ నిలబడి చూడడం నాకెంతో యిష్టం.

అలా ఎన్ని గంటలు చూసినా విసుగనిపించదు నాకు.

ఆ చీకటి లోయల్లో నేను చూసే వెలుగేమిటో ఎవరికీ అర్థం కానిది.

నా జీవితానికి వెలుగునిస్తానన్న నిశాంత్ అక్కడే అస్తమించేడు. అప్పటినుంచి నా జీవితంలో అవకాశం దొరికినప్పుడల్లా అక్కడికి వచ్చి ఆ ప్రాంతంలో రోజులు రోజులు గడపడం నా జీవిత చర్య అయిపోయింది.

ఎన్నోసార్లు నేను కూడా ఆ లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను.

కాని... ఎందుకో నేనలా చేయలేకపోయాను.

చావంటే నాకు భయమని చెప్పలేను.

బాగా ఆలోచించగలిగేవారెవరూ ఆత్మహత్య చేసు కోలేరని నా ఉద్దేశం. ఒక క్షణపు ఆవేశమే మనిషిని ఆత్మహత్యవైపు పురికొల్పుతుంది.

నిజానికి నిశాంత్ లేని జీవితాన్ని నే నెన్నడూ ఊహించనైనా లేదు. నిశాంత్ లేకుండా ఇన్ని సంవత్స రాలు నే నెలా బ్రతికేనో, బ్రతకగలుగుతున్నానో నాకే అంతుబట్టని సత్యం.

నేను చచ్చిపోతే... ఆ తర్వాత ఏమవుతాను?

ఇప్పుడు నాకు నిశాంత్ లేకపోయినా ఒక మనసుంది. దాన్నిండా నిశాంత్ గురించి ఆలోచనలు, జ్ఞాపకా లున్నాయి.

ఇప్పుడు నేను చచ్చిపోతే నా మానస మంజూష పగిలి దానిలో భద్రపరిచిన అతని స్మృతులు చెల్లాచెదురై పోవా?

ఆ ఆలోచనే నన్ను చావనియ్యలేదు.

ఇప్పుడు నా వయసు నలభై సంవత్సరాలు.

గత ఇరవై సంవత్సరాలుగా నా ప్రేమ స్మృతి పరిమళాన్ని గుండెల్లో మోస్తూ బ్రతుకుతూనే వున్నాను.

ఇన్ని సంవత్సరాల ఎడబాటు నిశాంత్ జ్ఞాపకాలని ఏమాత్రం ఏమరనివ్వలేదు సరికదా, ఆలోచనల్లో నేను అతనికి మరింత సన్నిహితురాల నయ్యేను.

నా ప్రేమ కథ గురించి కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు.

కొన్ని అభిరుచులు, ఆకర్షణ మా ఇద్దర్నీ దగ్గర చేసేయి. ఇద్దరూ ఒక చోట ఉద్యోగం చేస్తుండగా చేరువయ్యేం. ఉద్యోగానికి కొత్త, వయసులో చిన్న, చిలిపిదనంలో మిన్నగా వున్న మేమిద్దరం మంచి స్నేహితుల మయ్యేం.

దాన్ని స్నేహమే అనడానికి ఇష్టపడని మా కొలీగ్స్ ప్రేమ రంగు చల్లి పెద్ద పబ్లిసిటీ ఇచ్చేరు.

ముందు నేను చాలా కంగారుపడిపోయేను.

నిశాంత్ మాత్రం నవ్వి "ఇది మామూలే! మనిద్దరం ఆడ మగ- కొంత ఆలస్యం చేశాం. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ప్రేమించుకుందాం" అన్నాడు.

నే నతనివైపు కోపంగా చూశాను.

"నీకేమైనా అభ్యంతరమా?" అన్నాడతను చిలిపిగా.

నేను జవాబు చెప్పలేదు. విసురుగా ఇంటికొచ్చే శాను. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

మొదట అలా మాట్లాడినందుకు నిశాంత్ మీద కోపం వచ్చింది కాని, ఆలోచించగా ఆలోచించగా అతని మాటల్లో విపరీతం ఏమీ గోచరించలేదు.

నిశాంత్ అంటే నాకెంతో ఇష్టం. అతన్ని చూడ కుండా వుండలేను. నా ఆనందాన్ని, అనుభూతుల్ని, బాధని- అన్నింటిని అతనితో పంచుకోవాలని వుంటుం ది. అతనొక రోజు ఆఫీసుకి రాకపోతే నా మనసు చిన్న బోతుంది. నిరుత్సాహం ఆవరిస్తుంది. ఇదంతా ప్రేమ కాదా?

అంటే... ఒక మనిషిని విపరీతంగా ఇష్టపడడం- అతని సాన్నిధ్యం కోరుకోవడమేనా ప్రేమంటే?

అలా అనుకోగానే నా మనసులో ప్రేమ పట్ల వున్న చిక్కుముడి విడిపోయినట్లయింది.

మర్నాడు నిశాంత్‌ని చూడగానే నా కళ్ళలో తడ బాటు చోటు చేసుకుంది. మాటలు తడబడ్డాయి.

నిశాంత్ చిన్నగా నవ్వి "ఏంటలా వున్నావ్?" అన్నాడు.

"ఏం లేదు. నీతో కాస్త మాట్లాడాలి!" అన్నాను కంగారుగా.

"ఓ.కె. మాట్లాడు!" అన్నాడు నిశాంత్ నా సీటు దగ్గరున్న కుర్చీ లాక్కుంటూ.

"ఇక్కడ కాదు. సాయంత్రం ఏదైనా పార్కు కెళ్దాం" అన్నాను.

"పార్కుకా? అవన్నీ పట్టపగలే పబ్లిక్ లాడ్జింగు లయిపోయేయి. వద్దులే" అన్నాడు నిశాంత్.

"పోనీ ఏదైనా సినిమాకి. నువ్వు నీ సీటుకెళ్ళిపో" అన్నాను గాబరాగా చుట్టూ చూస్తూ. స్టాఫ్ మమ్మల్ని అబ్జర్వు చేసి వంకరగా నవ్వుతున్నట్లు సిగ్గుగా వుంది నాకు.

అదే ఆఫీసులో సీటు దగ్గర ఎన్నో గంటలు కబుర్లు చెప్పుకున్నాం మేము. ఏ రోజూ భయపడలేదు నేను. ఎవరో మమ్మల్ని కనిపెడుతున్నారన్న కంగారు అసలు లేనే లేదు. కాని... ఈ రోజు అతన్ని ప్రేమిస్తున్నానను కునేసరికి భయం, గాబరా కలుగుతున్నాయి.

"సరే!" అంటూ వెళ్ళిపోయేడు నిశాంత్.

* * *

ఆ సాయంత్రం బ్రహ్మాండంగా రెండొందల రోజు లాడి రికార్డు బద్దలు చేసిన సినిమాకి వెళ్ళేం. హాలంతా ఖాళీగా వుంది. ఇంకో పది రోజులాడితే రెండొందల యాభై రోజులవుతుందని బలవంతంగా ఆడిస్తున్నాడట ప్రొడ్యూసర్.

ఇద్దరం పై వరుసలో కూర్చున్నాం.

న్యూసు రీలు వస్తోంది.

"ఇప్పుడు చెప్పు" అన్నాడు నిశాంత్.

"అప్పుడేనా?" అన్నాను నవ్వుతూ.

"సినిమా కాస్త చూస్తేకాని ఇన్‌స్పిరేషన్ రాదా?"

నేను తల వంచి నవ్వేను.

అసలు సినిమా మొదలైంది.

హీరోయిన్ అండర్‌వేర్స్ కన్నా అధ్వాన్నంగా వున్న

బట్టలు తొడుక్కుని సీరియస్‌గా షాపింగ్‌కి వెళ్తున్నది. గూండాలాంటి హీరో ఆమె పర్స్ కొట్టేసేడు. హీరోయిన్ 'హెల్ప్ హెల్ప్' అంటూ అరుస్తోంది. హీరో లాంటి విలన్ తన బాచ్‌తో వచ్చి హీరోని చావగొట్టి పర్సు హీరోయిన్‌కి ఇస్తాడు. మర్నాడు హీరో సైకిల్ షాపు దగ్గర పంపు కొడ్తూ కార్లో వెళ్తున్న హీరోయిన్‌కి కనిపిస్తాడు. హీరోయిన్ జాలిపడి పలుకరిస్తుంది. హీరో తను దొంగతనం చేయడానికి చావు బతుకుల మధ్య వున్న తన తల్లి కారణమని సైకిలు పంపుకి, జీవితానికి వున్న సాపత్యాన్ని వివరిస్తాడు.

అంతే! డ్యూయట్!

హీరో హీరోయిన్‌ని అసభ్యమైన పదాలతో వర్ణిస్తూ దొర్లిస్తూ పాట పాడడం, హీరోకి విలన్‌కి ఫైటింగ్- చివర్లో హీరోకి, హీరోయిన్‌కి పెళ్ళి!

సినిమా పూర్తయ్యేసరికి ప్రేమంటేనే వెగటొచ్చింది నాకు.

"నిన్ను ప్రేమిస్తున్నాను నిశాంత్!" అని ఎంతో మధురంగా అతనికి చెప్పాలని వచ్చిన నేను సినిమా మాసి చేదు మింగినట్లయిపోయేను.

"ఏదో మాట్లాడాలన్నావ్! చివరికి సినిమా కూడా పూర్తయింది. నువ్వు పెదవి విప్పనేలేదు" అన్నాడు నిశాంత్ బయటకొస్తూ.

"ఈ సినిమా ఇన్ని రోజులెందుకాడినట్లు?" అన్నాను అతని ప్రశ్నకి జవాబు చెప్పకుండా.

నిశాంత్ చుట్టూ చూస్తూ "నయం- ఈ రోజు రష్ లేదు కాబట్టి బతికిపోయేం. లేకపోతే అభిమాన సంఘాలు మనల్ని చితకబాది ప్రొడ్యూసర్‌కి పార్సెల్ చేసేవారు" అన్నాడు.

"నిజం నిశాంత్, అంత అసభ్యకరమైన మాటలతో హీరో హీరోయిన్ని ఉడికిస్తుంటే హీరోయిన్ లాగి కొట్టక ప్రేమించేనని ఎగబడుతుందేమిటి? అదేనా ప్రేమంటే!" అన్నాను ఆవేశంగా.

"ఖర్మ! సినిమాల్ని మాసి ప్రేమకి భాష్యం తెలుసుకుంటానంటే నిన్నీ మషాలా సినిమాకి తీసుకొచ్చేవాణ్ణి కాదు".

"మషాలా సినిమాలంటూ వేరే వుంటాయా?"

"ఉంటాయి. అసలు సినిమాలో సరుకు లేనప్పుడు ఇలాంటి పచ్చి డైలాగ్స్‌తో కేష్ చేసుకునే సినిమాలు."

"ఛ!" అన్నాను ఏహ్యంగా.

"సరే! అసలు సంగతి ఇప్పుడైనా చెబుతావా?" అంటూ అడిగేడు నిశాంత్.

"ఇప్పుడు కాదు" అనేశాను.

కాని చాలా రోజుల వరకు నేనామాట అతనికి చెప్పనేలేకపోయాను.

* * *


"ఈ రోజు మా ఊరెళ్తున్నాను" అన్నాడు నిశాంత్ ఒక రోజు నాదగ్గరకొచ్చి.

"ఎందుకు?"

"నా పెళ్ళి!"

నేను ఉలిక్కిపడ్డాను.

"ఎప్పుడు?" అన్నాను మెల్లిగా.



"తేదీ నిర్ణయించలేదు. వాళ్ళ అమ్మాయిని చూశారట. నేను ఫార్మల్‌గా మాసి అంగీకరిస్తే ముహూర్తం పెడతామని రాశారు. రాత్రికి బయల్దేరుతున్నాను."

నా మనసులోంచి దుఃఖం తన్నుకొస్తోంది. ఎక్కడ బయటపడిపోతానో అని భయంగానూ వుంది.

"బెస్టాఫ్ లక్!" అంటూ సీట్లోంచి పని వున్నట్టుగా లేచి వెళ్ళిపోయాను.

అతనెళ్ళిపోయాడు.

సాయంత్రం వరకు దుఃఖాన్ని దిగమింగి పని చేయడం కష్టమైపోయింది. పర్మిషన్ పెట్టి బయటికి వస్తుంటే "ధరణీ" అన్న పిలుపు విని ఆగిపోయేను.

నిశాంత్!

"ఏం తొందరగా వెళ్ళిపోతున్నావు?" అంటూ నాతోపాటూ నడవడం ప్రారంభించాడు.

"వంట్లో బాగాలేదు."

"వంట్లోనా? మనసులోనా?"

నే నతనివైపు కోపంగా చూడబోయేను. కాని ఆ కోపాన్ని కప్పేస్తూ కన్నీళ్ళు జారేయి.

"ఛ! ఏడుస్తున్నావా? ఏం జరిగింది?" అన్నాడు కంగారుగా.

అతని ఊరడింపుకి నా దుఃఖం వెల్లువైంది.

జవాబు చెప్పలేకపోయాను.

"ఏడవకు. ఏదైనా కావాలంటే అడుగు. నువ్వేం చెయ్యమన్నా చేస్తాను. కాని ఇలా ఏడిస్తే నా కిష్ట ముండదు" అన్నాడు నిశాంత్.


నేను కాస్సేపు మౌనంగా వుండి "నీకో సంగతి చెప్పాలనే ఆ రోజు సినిమాకి తీసుకెళ్ళేను. కాని ఆ దరిద్రగొట్టు సినిమా చూసి చెప్పాల్సింది చెప్పలేక పోయేను నిశాంత్!" అన్నాను బాధగా.

"పోనీ, ఈ మధ్యలోనైనా చెప్పలేకపోయేవా?"

"ఆ ఛండాలపు సినిమా చూశాక..."

"అబ్బ! సినిమాని తిట్టడం ఆపి అసలు సంగతికి రా! నా కవతల ట్రెయినుకి టైమవుతోంది."

నేను చెప్పాలని ప్రయత్నించేను. పెదవులు కదల




లేదు. నిస్సహాయంగా "ఏం లేదు" అన్నాను.

"సరే! నే వెళ్తున్నాను" అన్నాడు నిశాంత్.

"నేనూవస్తాను" అన్నాను.

"మా ఇంటికా? మా నాన్న చండశాసనుడు. డొక్క చించేస్తాడు."

"కాదు స్టేషన్‌కి."

ఇద్దరం స్టేషన్లోకి వెళ్ళేసరికి ట్రెయిను ప్లాట్‌ఫారం మీద సిద్ధంగా వుంది.

నిశాంత్ ట్రెయినెక్కి గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

"సిగ్నల్ ఇచ్చేరు" అన్నాడు నా వైపు చూస్తూ.

"ఊ" అన్నాను నీరసంగా.

"గార్డు జెండా వూపుతున్నాడు"

నేను తల వూపేను.

"రైలు కదులుతోంది. ఇప్పటికూడ చెప్పలేవా?" అన్నాడు నిశాంత్.

నా కళ్ళలో నీళ్ళు పొంగేయి.


రైలు ముందుకి జరుగుతోంది. నిశాంత్ దూర మవుతున్నాడు.

నేను రివ్వున పరిగెత్తి నిశాంత్ చెయ్యి అందుకొని ముద్దు పెట్టుకున్నాను. నిశాంత్ వెంటనే రైల్లోంచి దూకేసేడు.

నేను ఆశ్చర్య పోతూ "ఊరెళ్ళవూ?" అన్నాను.

"ఇంకెందుకు? అసలు విషయం తెలిసేక" అన్నాడు నవ్వుతూ.

"నిన్ను ప్రేమించేను అని చెప్పడానికి ఇన్ని రోజులా! నిన్ను పెట్టుకొని సినిమా తీస్తే నిర్మాత ఆరిపోతాడు"

అన్నాడు నా భుజమ్మీద వెయ్యేస్తూ.

నేను సిగ్గుగా తలదించుకున్నాను.

* * *

ఆ రాత్రి తిరుమల కాటేజ్‌లో-

"ఇలా జరుగుతుందని అనుకోలేదు" అన్నాను ఆవేదనగా నిశాంత్ ఒడిలో తల దాచుకుంటూ.

నిశాంత్ నా వైపు చురుగ్గా చూస్తూ "మన పెళ్ళి జరగాలని కోరుకోలేదా నువ్వు!" అన్నాడు.

"అది కాదు. మన వాళ్ళంత కఠినంగా ఒప్పుకోరని, పట్టుదల కోసం మనల్ని దూరం చేసుకుంటారని అనుకోలేదు."

"ఇక వాళ్ళ సంగతి మానేసి మన గురించి ఆలోచించడం మొదలెట్టు. రేపు, ఎల్లుండి కూడ మంచి ముహూర్తాలున్నాయట. ఏ రోజు చేసుకుందాం పెళ్ళి!" అన్నాడు నిశాంత్ చిలిపిగా చూస్తూ.

"ఎల్లుండి చేసుకుందాం" అన్నాను నవ్వుతూ.

నిశాంత్ నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఇంకా రేపటి దాక ఆగలేవంటావనుకున్నాను. ఎల్లుండి దాక పోస్ట్ పోన్ చేస్తున్నావేంటి?" అన్నాడు కళ్ళెగరేస్తూ.

"ఈ తిరుమల ఎంతో బాగుంది. రేపంతా తిరిగి చూద్దాం" అన్నాను.

"రేపు పెళ్ళి చేసుకొని ఎల్లుండి చూడొచ్చుగా!" అన్నాడు నిశాంత్.

నేను సిగ్గుగా అతని వైపు చూసి "చెబితే ఏం అనుకోవుగా!" అన్నాను.

అతను తల అడ్డంగా తిప్పేడు.

"మామూలు భార్యాభర్తల్లా తిరగడంలో థ్రిల్ లేదు. మనం ప్రేమికులుగా ఈ ప్రదేశాల్ని చూడడంలో ఎంతో ఆనందముంది."

నా మాటకి అతను నవ్వి "తెలివైన దానివే!" అన్నాడు.

* * *

ఆ రోజంతా తిరుమల చుట్టూ వున్న ప్రదేశాలన్నీ చూసేసేం.

సాయంత్రం కాటేజికి వచ్చి స్నానం చేసి ఉడ్‌లాండ్స్‌లో భోంచేసి వస్తుంటే "అలా కొండ చివరి కెళ్ళి కబుర్లు చెప్పుకుందాం" అన్నాను.

"ఇప్పుడా?" అన్నాడు నిశాంత్.

"చీకటి పడితేనేం? వెన్నెల వుందిగా!" అన్నాను నేను.

ఇద్దరం కొండ కొసన వున్న రీటైనింగ్ వాల్‌కి జేరబడి నిలబడ్డాం.

చీకటి నిండిన కొండలు వెన్నెల పమిటలు వేసుకొన్నాయి. కొండల మధ్య చిక్కుపడిన గాలి ఈలలు వేస్తోంది. లోయంతా మిణుగురులు తిరుగుతూ రాలి పడుతున్న నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

పేరు తెలియని పక్షుల కువకువలు, మంచుతో తడిసిన గాలుల స్పర్శ- .ఎంతో ఆనందంతో చూస్తున్నాం.

"ఇప్పుడా లోయల్లోకి జారితే ఎలా వుంటుంది?"



ప్రఖ్యాత వాస్తుశిల్పి శ్రీ బి.ఎస్.రెడ్డి ఆంగ్ల కవితా సంకలనం 'డ్యూస్ ఆఫ్ ది డాన్'ను ఇటీవల హైదరాబాద్ ఇందిరా ప్రియదర్శిని హాలులో జరిగిన సభలో డాక్టర్ నవనీతరావు -ఆవిష్కరించిన దృశ్యం. డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ దొణప్ప వేదికపై వున్నారు.

"ఛ" అన్నాను బాధగా.

"ప్రమాదంలో కూడ ప్రమోదం వుంటుంది ధరణీ!" అన్నాడు నిశాంత్ నవ్వుతూ.

"మీ పేరు ధరణి కదూ!"

నేను వెనక్కి తిరిగి చూశాను.

ఎవరో నాకు తెలియని వ్యక్తి నిలబడి వున్నాడక్కడ.

"మీ నాన్నగారొచ్చేరమ్మా. కాటేజ్ దగ్గర వున్నారు."

"నాన్నగారొచ్చేరా?" అన్నాను విస్మయంగా చూస్తూ.

"అవునమ్మా-ఒక్కసారి రమ్మంటున్నారు"

"ఒక నిముషం! నాన్నగారిని ఇక్కడికే తీసుకొస్తాను" అంటూ నిశాంత్‌కి చెప్పి అతనితో కాటేజ్‌కి వచ్చేను.

నాన్న నిలబడి వున్నారక్కడ.

"నాన్నా!" అన్నాను ఆనందంగా.

"ఏమ్మా, మాకు చెప్పకుండానే పెళ్ళి చేసుకుందామనుకున్నావా?" అన్నారు నాన్న.

నేను తప్పు చేసిన దానిలా తలదించుకొని "మీరు ఇష్టపడ లేదుగా నాన్నా!" అన్నాను.

"ఏదో పెద్దవాళ్ళం! కొన్ని పట్టింపులుంటాయి. కాని అంత మాత్రానికే కన్నవాళ్ళని వదిలేసుకునేంత కఠినాత్ములం కాము. అబ్బాయేడీ?" అన్నారు చుట్టూ చూస్తూ.

"గార్డెన్‌లో కూర్చున్నారు. మీరు స్నానం చేస్తే ఇద్దరం వెళ్దాం" అంటూ గీజర్ ఆన్ చేసేను.

నాన్న స్నానం చేసాక నిశాంత్ కూర్చున్న గార్డెన్‌లోకి మేము వెళ్ళేసరికి అక్కడ జనం మూగి వున్నారు.

"ఏం జరిగింది?" అన్నాను కంగారుగా.

"ఆ బాబెవడో గోడ కానుకొని నిలబడ్డాడు. గోడిరిగి లోయలోకి పడిపోనాడు" అన్నాడొక వ్యక్తి.

నేను అపనమ్మకంగా చుట్టూ చూశాను.

అక్కడ నిశాంత్ గాగుల్స్, స్వెట్టరు పడి వున్నాయి.

నా కళ్ళనిండా చీకటి అలముకొంది. జావలా జారిపోయేను.

* * *

సరిగ్గా ఆ సంఘటన జరిగి ఇరవై సంవత్సరాలు!

ప్రతి సంవత్సరం ఆ రోజున ఎన్ని పనులున్నా అక్కడి కొచ్చి ఆ గోడమీద పూలు పెట్టి కొన్ని గంటలు గతాన్ని నెమరేసుకుంటాను.

నిశాంత్ జ్ఞాపకాలతో ఊపిరి పోసుకుంటూ అలానే కూర్చున్నాను ఆ రోజు.

నేను కూర్చున్న చోటికి ఒక వ్యక్తి వచ్చేడు. అతను కూడ గోడమీద పూలు పెట్టి గోడకి తల వాల్చి "ధరణీ అయ్ లౌ యూ!" అన్నాడు.

నేను ఉలిక్కిపడి చూశానతని వైపు.

చీకట్లో మొహం కనిపించడం లేదు.

"మీ పేరు?" అన్నాను ధైర్యం చేసి.

అతను నా వైపు తలతిప్పి "నిశాంత్" అన్నాడు.

నాకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు.

దుఃఖం వెల్లువలా పొంగుకొచ్చింది. అది ఆనందమో, బాధో! చూసి "ఏం జరిగిందమ్మా!" అన్నాడు.

నేను దుఃఖం ఆపుకుంటూ "నేనే ధరణిని" అన్నాను.

అతను నివ్వెర పోతూ చూస్తూ "నువ్వు... నువ్వు బతికే వున్నావా ధరణీ!" అన్నాడు బాధగా.

నేను మాట్లాడ లేకపోయేను.

"ఆ రోజు మీ నాన్నగారు వచ్చేరని నిన్ను తీసుకెళ్ళిన వ్యక్తి మీ నాన్నగారు నిన్ను బలవంతంగా తీసుకెళ్ళిపోతున్నారని చెప్పేడు. నేను పరిగెత్తు కొచ్చేసరికి మీ రిద్దరూ లేరు. మర్నాడు నువ్వీ లోయలో దూకి చచ్చిపోయేవని... నీ గొలుసు... ..."

నేను నిర్లిప్తంగా నవ్వి "నన్నూ అంతే చేసేరు. నువ్వు జారి ఈ లోయలో పడి..." అన్నాను.

"ఎంత దగా!" అన్నాడతను ఆవేదనగా.

# బి.ఎన్. భాషితాలు



### ఎంత కఠినుడవు

కట్టుకున్న భార్య మృత్యువు కళ్లారా చూశాను
కన్న బిడ్డల కష్టాలు చూడలేకున్నాను
స్వామీ నీవెంత కఠినుడవు
కనీసం చావైనా సమయం మీద ఇవ్వలేవా?

### చావు—పుట్టుకలు

ఒకశ్వాస పోవడం
ఒక శ్వాస రావడం
చావు—పుట్టుకల
రహస్యమంతా ఇంతే.





### మనోవ్యధ

ఎన్నిరోజుల నుంచి త్రాగుతున్నాను
ఎన్ని సీసాలు ఖాళీ చేశాను
నా పిచ్చి కానీ
త్రాగితే పోయేదా ఈ మనోవ్యధ?

— వాస్తు శిల్పి: బి.ఎన్.రెడ్డి

"నేను ప్రతి సంవత్సరం ఇక్కడికొస్తానే! నువ్వు కనిపించనే లేదెందుకని?" అన్నాను.

"నువ్వు చచ్చిపోయేవని తెలిసేక నన్ను పెళ్ళి చేసుకోమని వత్తిడి చేసేరు మా వాళ్ళు. అది తప్పించుకునేందుకు ఫారిన్ వెళ్ళిపోయేను నేను. ఈ సంవత్సరమే మా అమ్మ చనిపోయిందని తెలిసి ఇండియా వచ్చేసా."

"నువ్వు పెళ్ళి చేసుకోలేదా?" అన్నాను విస్మయంగా. "ఉహూ! నువ్వు..."

"లేదు నిశాంత్!" అన్నాను కన్నీళ్ళతో.

"ఎందుకేడుస్తావు? ఆలస్యంగానయినా తిరిగి దేవుని సన్నిధిలోనే కలుసుకున్నాం మనం. ప్రేమ ఓడిపోదని నిరూపించేం. రేపు ఇక్కడే పెళ్ళి చేసుకుందాం" అన్నాడు నిశాంత్ నా దగ్గరగా వచ్చి తల నిమురుతూ.

అలా ఎంత సేపు గడచిందో!

"ఇక వెళ్దామా?" అతని మాటకి స్పృహలోకొచ్చేను. ఇద్దరం కాటేజ్‌లవైపు నడుస్తున్నాం.

"ఎవరితో వచ్చేవు?"

"ఎవర్నూ లేరు!'

"మరయితే నా కాటేజ్‌కి వచ్చేయకూడదూ!" అన్నాడు.

"ఉహూ!"

"సరే అయితే! రేపు పట్టుచీర కట్టుకొని సిద్ధంగా వుండు. గుడికి వెళ్దాం. సింపుల్‌గా చేసుకుందాం. గుడ్‌నైట్!" అన్నాడు నా చెయ్యి వదులుతూ.

నేను తలవూపి ముందుకు నడిచేను.

* * *

టైమెంతయిందో తెలీదు.

నిద్రరావడం లేదు.

నిశాంత్‌ని తిరిగి చూస్తాననుకోలేదు. హఠాత్తుగా తెలిసిన ఈ నిజం నన్ను నిలువునా కుదిపేస్తుంది. జీవితాలు కూడ కథల్లాంటివేనా?

ఇన్ని సంవత్సరాలుగా అతను కూడ నా కోసమే వుండిపోవడం నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కల్గిస్తోంది!

ఆ నిజాన్ని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నాను.

ఎవరో ఏడుస్తున్న శబ్దం!

ఉలిక్కిపడి లేచి హోల్ బయటకి కిటికీలోంచి చూశాను. ఒక స్త్రీ రోదిస్తూ నిలబడి వుంది.

"ఎవరమ్మా" అంటూ తలుపు తీసేను.

ఆమె చూడడానికి మంచి కుటుంబం మనిషిలా వుంది.

"కొంచెం సేపు ఇక్కడ వుంటాను" అంది తల దించుకొని.

"ఏం జరిగింది? లోపలికి రండి!" అన్నాను.

ఆమెలోనికొచ్చి కూర్చుంది.

"మీ బాధ ఏమిటో చెప్పండి. ఎవరైనా వెంబడిస్తున్నారా?" అన్నాను.

"అదేం లేదు. మా వారితోనే చిన్న తగాదా. మా ఆడఁబడుచు పెళ్ళికని వచ్చేం. మగపెళ్ళివారు శక్తికి మించిన కోరికలు కోరుతున్నారు. ఈయన అల్లారు ముద్దు చెల్లెలని నా వంటిమీద నగలు కూడ తీసుకొని అమ్మి చేస్తున్నారు. రేపు మన పిల్లగతి ఏంటన్నానని చెయ్యి చేసుకున్నారు" అంది ఏడుస్తూ.

"మీది ఎరేంజ్‌డ్ మేరేజా?" అడిగేను నేను.

"కాదు. ప్రేమించి చేసుకున్నాం. ఆయనకి నేనంటే ప్రాణం. కాని నిత్యం ఇంట్లో వుండే ఆర్థిక ఇబ్బందులు, సామాజిక న్యాయాలు, మనుషులు మా ప్రేమని ఆవిరి చేసేసేరు. చివరికి ఆయన చేతుల్లో దెబ్బలు, తిట్లు మిగిలేయి" అంది బాధగా.

ఇంతలో ఆమె భర్త వచ్చి తిడుతూ తీసుకెళ్ళేడామెని.

నా మెదడు వేడెక్కి పోయింది. పెళ్ళి ప్రేమని నాశనం చేస్తుందా?

నిశాంత్ నన్ను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఇరవై సంవత్సరాలు నా కోసం పరితపిస్తూ వుండిపోయేడు. నా కళ్ళారా చూశాను. ఇప్పుడిక దేని కోసం నేనతన్ని వివాహం చేసుకోవాలి! పెళ్ళి చేసుకొని ఈ సామాన్య సామాజికపుటిరుసు కింద నలిగి మేం కూడ మామూలు భార్యా భర్తల్లా కీచులాడుకోవాలా? ఒకే కప్పు కింద శత్రువులుగా మారి పోవాలా!

వద్దు! నా కతని ప్రేమ కావాలి!

అది కావాలంటే నేనతనికి దూరంగా... మనసుకి మాత్రం దగ్గరగా...

అంతే!

నేను వెంటనే తెలవారకుండానే కాటేజ్ ఖాళీ చేసి తిరుపతి వచ్చి బెయిువెక్కేసేను.

అప్పుడు తెలవారుతోంది.

నిశాంత్ నా కోసం... జీవితాంతం పరితపిస్తాడు . ఆ ప్రేమే నాకు కావాలి!


పద్మాలయావారి
సీరియల్

చావా శివకోటి
సంసార చక్రం

వచ్చే సంచికలో
ప్రారంభం